
# నవభూమి



## జిల్లా అనుబంధం

26 జూన్ ,2025 గురువారం పేజీలు:7

www.epaper.navabhoomi.in


### పరిశుభ్రమైన ఖమ్మం నగరం తయారు చేసేందుకు

# ప్రజలు సహకరించాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు
- ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 11వ డివిజన్ వరదయ్య నగర్‌లో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల





**ఖమ్మం నవభూమి బ్యూరో, జూన్ 25:** పరిశుభ్రమైన ఖమ్మం నగరం తయారు చేసేందుకు ప్రజలు సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంత్రి, నగర మేయర్ పునుకొల్లు నీరజ, నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి బుధవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 11వ డివిజన్ వరదయ్య నగర్ లో నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ వానలు రాక ముందే కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక చొరవతో కాల్వలో మురుగు నీరు నిల్వ ఉండకుండా, ఎక్కడా చెత్త పేరుకొని పోకుండా, దుర్గంధం రాకుండా 100 రోజుల ప్రణాళిక సిద్ధం చేసుకుని గత 20 రోజులుగా ప్రతి డివిజన్ లో ప్రజల సహకారంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను రోజూ సేకరిస్తున్నట్లు, రోడ్లు, డ్రెయిన్ లలో చెత్త వేయవద్దని అన్నారు. పరిశుభ్రమైన ఖమ్మం తయారు చేసేందుకు కార్పొరేషన్ చేసే కృషికి ప్రజలు సహకరించాలని మంత్రి కోరారు. మన నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే మనకు, మన పిల్లలకు మంచి ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ, 100 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా ప్రతి డివిజన్ లో ఉన్న డ్రెయిన్లను శుభ్రం చేయడం, పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, పిచ్చి మొక్కల తొలగింపు వంటి కార్యక్రమాలను చేపట్టామని అన్నారు. నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ 11వ డివిజన్ లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టామని, రోడ్లను, డ్రెయిన్ లను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. 20 రోజుల క్రితం వర్షాకాలంలో పారిశుధ్య నిర్వహణకు వంద రోజుల స్పెషల్ డ్రైవ్ చేపట్టామని అన్నారు. అంతకుముందు మంత్రివర్యులు వరదయ్య నగర్ లో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా, పబ్లిక్ హెల్త్ ఇఇ వి. రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

### సీఎం వద్దకు ఇల్లెందు సిఐ సస్పెన్షన్

# పంచాయతీ?

## కోడలికి న్యాయం చేయాలని చూసినా తప్పే



**కొత్తగూడెం జూన్ 25 నవభూమి ప్రతినిధి:** ఇల్లందు సిఐని అనవసరంగా సస్పెండ్ చేశారని, ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పరిస్థితి వివరించేందుకు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కాస్త గట్టిప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసి పరిస్థితి వివరించినట్టు తెలిసింది. ఇల్లందు సీఐ భార్యాభర్తల కేసు విషయంలో భర్త తల్లిదండ్రులను స్టేషన్లో హింసించలేదని, ఈ విషయంలో సిఐ తప్పేమీ లేదని ఇల్లందు ఎమ్మెల్యే భావిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు ఇల్లందు సీఐను కాపాడేందుకు ఎమ్మెల్యే తన శక్తిమేర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం ఆయన ముఖ్యమంత్రిని కలిసేందుకు ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. పాల్వంచ కు చెందిన యువతీ శ్రావ్య తో ఇల్లందుకు చెందిన ఎన్ ఆర్ ఐ నవీన్ రెడ్డి వివాహమైంది. అయితే ఆమెకు పిల్లలు పుట్టే అవకాశం లేదంటూ భార్యను పుట్టింటికి పంపేశాడు. అయితే శ్రావ్యకు న్యాయం చేయాలని ఉన్నతాధికారిని కలిసి దరఖాస్తు చేసి కోరింది. అయితే దరఖాస్తు పరిశీలించి తగిన చర్య తీసుకోవాలని ఆ ఉన్నతాధికారి ఇల్లందు సీఐ భత్తుల సత్యనారాయణ ను ఆదేశించారు.

ఇదిలా ఉండగా శ్రావ్య ముందస్తుగా పాల్వంచలో ఫిర్యాదు చేశారని, పాల్వంచ పోలీసులు పిలిపించినప్పటికీ నవీన్ రెడ్డిగాని ఆయన తరుపున తల్లిదండ్రులు గాని అక్కడ పోలీస్ స్టేషన్కు హాజరు కాలేదని సమాచారం. దీంతోనే విషయం కాస్త ఉన్నతాధికారికి చేరడంతో ఆయన ఇల్లందు సీఐను విచారించి తగిన చర్య తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఇల్లందులో ఉండే నవీన్ రెడ్డి తల్లిదండ్రులను స్టేషన్కు పిలిపించి సీఐ వాళ్ళను సాయంత్రం వరకు స్టేషన్ లో కూర్చోబెట్టినట్టు సమాచారం.

అయితే పోలీస్ శాఖలో అంతర్గత గొడవల్లో భాగంగా మరో అధికారి నవీన్ రెడ్డి తల్లిదండ్రులను ఇల్లందుకు చెందిన ఒక రాజకీయ నాయకుడి ద్వారా హైదరాబాద్లో ఐజి వద్దకు పంపినట్టు సమాచారం. ఇల్లందు పోలీస్ స్టేషన్లో సీసీటీవీ ఫుటేజ్ను ఉన్నతాధికారులు పరిశీలించారు. వాటిలో సీఐ ఎక్కడ నవీన్ రెడ్డి తల్లిదండ్రులతో దురుసుగా ప్రవర్తించడం, తిట్టడం లేదా లాకప్ లో వేయటం వంటివి సంఘటనలేవీ చోటు చేసుకోలేదని సమాచారం. అయినా ఇల్లందు సీఐను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఓ వివాహితకు న్యాయం చేసేందుకు పోలీస్ శాఖ ప్రయత్నించడం తప్పా? యువకుడి ఆమె భర్త తల్లిదండ్రులను స్టేషన్కు పిలిపించి మాట్లాడడం తప్పా? ఇలా అయితే మహిళలకు పోలీస్ స్టేషన్లో సైతం ఏం న్యాయం జరుగుతుందని ప్రశ్నలు తలెత్తుతు న్నాయి.

### ఏసీబీ అదుపులో మరో

# సింగరేణి ఉద్యోగి



**కొత్తగూడెం జూన్ 25 నవభూమి ప్రతినిధి:** సింగరేణిలో ఉద్యోగాల పేరుతో అక్రమాలకు పాల్పడిన ముఠా లో మరోకర్ని అరెస్ట్ చేసిన ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై. రమేష్. సాదర్ల ప్రశాంత్ జనరల్ మజ్దూర్ (కాకతీయ ఖని – ఇంక్లైన్..) ని భూపాలపల్లి లో బుధవారం అరెస్ట్ చేశారు. గతంలో ఇదే కేసుకి సంబంధించి రాజేశ్వరరావు, కడాలి చైతన్యను ఇప్పటికే ఏసీబీ అదుపులోకి తీసుకుంది. మొత్తం ఈ చైన్ లింకును లోతుగా విచారిస్తున్నారు. త్వరలోనే మరికొన్ని అరెస్టులు ఉండే అవకాశం ఉంది

# ఇల్లెందు సిఐ బత్తుల సస్పెన్షన్

**ఇల్లెందు జూన్ 25 నవభూమి ప్రతినిధి:** ఇల్లెందు స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్ హెచ్ ఓ) ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసిన మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి. భార్య భర్తల మధ్య వివాదం కేసులో భర్త తల్లిదండ్రులతో దురుసుగా ప్రవర్తించి వారి హక్కులకు భంగం కలిగించినందులకు గాను మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఇల్లందు సీఐ సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేయడం జరిగింది. పోలీసు అధికారులు గానీ, సిబ్బంది గానీ ఎవరైనా పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో అమర్యాదగా ప్రవర్తిస్తే శాఖా పరమైన విచారణ జరిపి క్రమశిక్షణా చర్యలు తప్పవని ఈ సందర్భంగా తెలియజేసారు.

# టెన్త్ విద్యార్థి ఆత్మహత్యా యత్నం

**కొత్తగూడెం జూన్ 25 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం లో పదవ తరగతి విద్యార్థి పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన ఇది. సుజాతనగర్ మండలం ఉప్పరి గూడెం కు చెందిన ఒక విద్యార్థి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని ఎస్ ఆర్ డీజీ ప్రైవేట్ స్కూల్ లో 10వ తరగతి చదువుతున్నాడు. హోమ్ వర్క్ చేయకపోవడంతో మ్యాథ్స్ టీచర్ మందలించాడని, మనస్థాపంతో బుధవారం ఉదయం పురుగు మందు తాగాడని సమాచారం. అయితే ఇది స్కూల్లో తాగాడా, ఇంటి దగ్గర తాగి వచ్చాడా అనేది తెలియరాలేదు. విషయాన్ని గుర్తించిన తోటి విద్యార్థి, ఉపాధ్యాయుడికి సమాచారం ఇచ్చాడు. వెంటనే స్కూల్ సిబ్బంది వారి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించి, తొలుత కొత్తగూడెం, ఇక్కడి నుండి ఖమ్మం తరలించారు. మరింత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇంకా కేసు నమోదు కాలేదు


పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి 2

వరద విపత్తులను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి 5

# ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై విచారణ జరిపించాలి

## అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా



**జూలూరుపాడు, జూన్ 25 (నవ భూమి ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్దిదారుల ఎంపికలో భారీ ఎత్తున అవకతవకలు జరిగినట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ ఆక్షేపించారు. బుధవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో జరిగిన అవకతవకల పై తక్షణమే విచారణ జరిపి నిరుపేదలకు న్యాయం చేయాలని కోరుతూ సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో మితిమీరిన రాజకీయ జోక్యం వలన అర్హులైన నిరుపేదలకు పథకాన్ని దూరం చేసి అనర్హులకు పెద్దపీట వేసి వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయటం దారుణమని వ్యాఖ్యానించారు.మండల పరిధిలోని అనేక గ్రామాల్లో ఇల్లు కలిగి ఉన్న వారికి తిరిగి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారని అధికారుల కమిటీ సైతం అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుట వలన నిజమైన నిరుపేదలకు అన్యాయం జరిగిందని విమర్శించారు.దీనిపై తక్షణమే విచారణ జరిపి నిజమైన లబ్ధిదారులకు ఇళ్ళు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సమితి కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు,సహాయ కార్యదర్శి నాగుల్ మీరా, మధుసూదన్ రావు,యాస రోశయ్య,చాంద్ పాష గుడిమెట్ల సీతయ్య,అనుమల అశోక్,కంచర్ల రాజు, బుడేన్,గార్లపాటి శివకృష్ణ,బరగడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి

- ◆డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ నమోదుకు చర్యలు చేపట్టాలి
- ◆జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**కొత్తగూడెం జూన్ 25 నవభూమి ప్రతినిధి:** పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో కలెక్టర్ అధ్యక్షతన ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మతో కలిసి టీజీ ఐపాస్, జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావే శాన్ని సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు జిల్లా ఎంతో అనుకూలంగా ఉందని, దీంతో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. వారికి అన్ని రకాల అర్హతలు ఉంటే త్వరితగతిన స్థాపనకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా టీజీ ఐపాస్, టీప్రైడ్, పీఎం ఈజిపి, పీఎం ఎఫ్ఎంఈ, ముద్ర రుణాలు వంటి పథకాలు మరియు డిఆర్డిఏ ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా పరిశ్రమలు స్థాపించాలన్నారు. టీజీ ఐపాస్ కింద పరిశ్రమలకు కావలసిన వివిధ రకాల అనుమతులు మంజూరు, పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ప్రతి ఒక్కరికి సురక్ష బీమా వయోజన మరియు జీవనజ్యోతి బీమా యోజన పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా మట్టి ఇటుకల తయారీ తో షెడ్యూల్ నిర్మాణం చేపట్టాలన్నారు. జిల్లాలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ మరియు మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా వారికి ఏ రంగంలో శిక్షణ అవసరము తెలుసుకొని ఆ రంగంలో శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పంచాయతీలలో బయోచార్, ఏబిసిడి డ్రైవ్ లు పై అవగాహన కల్పించాలన్నారు. ఐటిఐ లు, పాలిటెక్నిక్ కళాశాలలు మరియు




నవ లిమిటెడ్ వారు సమన్వయంతో ఉపాధి హామీ పథకం ద్వారా మట్టి ఇటుకలతో వర్క్ షెడ్లు నిర్మించడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ వారు జిల్లాలోని ఐటిఐ విద్యను చదువుతున్న విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. స్కిల్ సెంటర్ ల ద్వారా జిల్లా వ్యాప్తంగా యువతకు వ్యవసాయ రంగ పరిశ్రమల పై శిక్షణా తరగతులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డి. ఈ. ఈ. టి ) ఈ యాప్ లో నమోదు అవ్వడం ద్వారా విద్యార్థులకు ఉన్న నైపుణ్యాలను అర్హత ప్రకారం ప్రైవేటు రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాలు వివరాలు తెలుస్తాయని, నిరుద్యోగులకు పరిశ్రమలకు వారధిగా ఇది పనిచేస్తుందన్నారు. ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ ఉపాధి కోర్సులను చదివిన విద్యార్థులు డి ఈ ఈ టి లో నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగంలో ఉపాధి పొందే అవకాశాలు మెరుగవుతాయని అన్నారు. విద్యార్థులందరూ దీనిలో నమోదు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తిరుపతయ్య, ఎల్ డి ఎం రామ్ రెడ్డి, షెడ్యూల్ తెగల సంక్షేమ శాఖ అధికారి అనసూయ, ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, భూగర్భ జల శాఖ ఏడి రమేష్, మైనింగ్ ఏడి దినేష్ పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెలో భాగస్వాములు కావాలి



**గార్ల, నవభూమి, జూన్ 25:** సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన కార్మికులు సమస్యల పరిష్కారం లో పాలకులు అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా జూలై 9 తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మె లో సంఘాలకు అతీతంగా కార్మికులు భాగస్వామ్యం కావాలని సిఐటియు మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ కోరారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం గార్ల వైద్యాధికారి రాజ్ కుమార్ జాదవ్ కు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయడం తో పాటు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కార్మికుల హెల్త్ భీమా కల్పించడం,తదితర సమస్యలపై సమ్మె నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య విధాన పరిషత్ విభాగం రాష్ట్ర కార్యదర్శి బైరపాక శ్రీనివాస్, వివిధ రంగాలకు చెందిన నాయకులు అశోక్, మాధవి, నర్సయ్య, మునేష్, సరోత, తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబి అలర్ట్ కార్యక్రమం



**తల్లాడ, నవభూమి, జూన్ 25:** తల్లాడ మండలం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ అలర్ట్ ఇండియా వారి సారధ్యంలో డాక్టర్ రత్న మనోహర్ సమక్షంలో తల్లాడ మండలంలోని వైద్య సిబ్బందికి చిన్నపిల్లల్లో టీబీ వ్యాధిని ఎలా గుర్తించాలి అనేదానిపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రత్నమనోహర్ మాట్లాడుతూ టీబీ వ్యాధి అనేది పెద్దల్లో కాకుండా చిన్న పిల్లల్లో కూడా వస్తుందని ఇలాంటి లక్షణాలను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లేదా జిల్లా క్షయనిర్మూలన కార్యాలయానికి పంపించాలని చిన్నపిల్లల్లో టిబి వ్యాధిని గుర్తించడానికి టీబీ అలర్ట్ ఇండియా వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిబి అలర్ట్ ఇండియా జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్ , పి హెచ్ సి టీబీ నోడల్ అధికారి పెద్ద పుల్లయ్య, సూపర్వైజర్ వై సురేష్, మండలంలోని పల్లె దువ కాన నర్సింగ్ ఆఫీసర్స్ స్టాప్ ఏఎన్ ఎమ్స్, మరియు ఐసిడిఎస్ సూపర్వైజర్స్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 7.370 కేజీల గంజాయి పట్టివేత: ముగ్గురి అరెస్ట్



**కొత్తగూడెం జూన్ 25 నవభూమి ప్రతినిధి:** ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి.జనార్ధన్ రెడ్డి , ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ జి.గణేష్ , ఏ ఈ ఎస్ కే.తిరుపతి ఆదేశాల మేరకు బుధవారం భద్రాచలం రవాణా చెకపోస్ట్ నందు వాహన తనిఖీలు నిర్వహించుచుండగా, ద్విచక్ర వాహనం పై అక్రమం గా రవాణా చేయుచున్న 7.370 కేజీ ల ఎండు గంజాయి ,ఒక సెల్ ఫోన్, నర్సంపేట కు చెందిన ముగ్గురు గడ్డం వంశీ, నోముల హరిప్రసాద్, జక్కుల అజయ్ లను అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం భద్రాచలం ఏక్సైజు సీఐ కు అప్పగించారు. ఈ తనిఖీలలో ఎన్ఫోర్స్మెంట్ సీఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ కరీం, కానిస్టేబుల్స్ సుధీర్, వెంకట్, వీరబాబు, ఉపేందర్ పాల్గొన్నారు. మత్తు పదార్థాల రవాణా మరియు వినియోగం గురించి ఏదైనా సమాచారం ఉన్నచో టోల్ ఫ్రీ నెంబర్ 18004252523 కు డయల్ చేసి తెలియజేయాలని, వివరాలు గొప్యంగా ఉంచుతామన్నారు.

# కారేపల్లిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**కారేపల్లి,నవభూమి,జూన్25:** యువత జీవితాలను డ్రగ్స్ మహమ్మరి ఆగం చేస్తుందని దాని బారిన పడవద్దని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎంఈవో దుగ్గిరాల జయరాజు, ఎస్సై బైరు గోపిలు అన్నారు. కారేపల్లి మోడల్ స్కూల్లో మాదకదవ్యాల నిర్మూలనపై పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, డాయింగ్ పోటీలను నిర్వహించారు. దీనిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ యువత ఆలోచనలు వ్యక్తిగత, సమాజ అభివృద్ధి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్యాషన్కోసం ప్రారంభించే ఏ వ్యాపకమైన అది వ్యక్తిత్వాన్ని, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. యువత వాటికి దూరంగా ఉండాలన్నారు.

**విజేతలకు బహుమతులు అందజేత:** విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై నిర్వహించిన ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీలో కేజీబీవీ విద్యార్థి బీ.పుష్పాంజలి ప్రథమ బహుమతి, మోడల్ స్కూల్ విద్యార్థి పీ.సంతోష్ ద్వితీయబహుమతి, నిర్మల హైస్కూల్ విద్యార్థి హల్య తృతీయ బహమతిని సాధించారు. డ్రాయింగ్ పోటీలో మొదటి బహుమతి తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి వర్షిని, ద్వితీయ, తృతీయ బహుమతులు మాధారం జేడీఏవీ విద్యార్థులు యోగేశ్వరి, దీప్తి లు సాధించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సైకిరణ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్, భాస్కరరావు ఎంఐఎస్ కోఆర్డినేటర్ మోతిలాల్, కంప్యూటర్ ఆపరేటర్ విజయ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చాతకొండ 6వ బెటాలియన్‌ను సందర్శించిన డిఐజి సన్నీ




**కొత్తగూడెం జూన్ 25నవభూమి ప్రతినిధి:** చాతకొండ 6వ బెటాలియన్ ను బెటాలియన్స్ డి ఐ జి సి.సన్నీ వార్షిక తనిఖీ లో భాగంగా బుధవారం సందర్శించారు. బెటాలియన్ కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి గౌరవ వందనంగా మైదానము నందు కవాతు నిర్వహించారు..ఈ సందర్భంగా డి ఐ జీ మాట్లాడుతూ బెటాలియన్ పోలీసు విధి, విధానాల గురించి మరోసారి గుర్తు చేయడం జరిగింది,తదనంతరం బెటాలియన్ లో డి ఐ జీ మొక్కలు నాటారు.అనంతరం బెటాలియన్ ఆఫీసు రికార్డ్స్ తనిఖీ చేసి, శరత్ మ్యాక్స్ విజన్ కంటి ఆసుపత్రి సహకారం తో ఉచిత కంటి పరీక్ష శిబిరం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కమాండెంట్ లు డి.శ్రీనివాసరావు , హెచ్ అబ్దుల్ రషీద్, ఆర్. ఐ లు, ఆర్. ఎస్. ఐ లు బెటాలియన్ పోలీసు సిబ్బంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గార్ల ముత్యాలమ్మ గుడికి విరాళం



**గార్ల, నవభూమి, జూన్ 25:** గార్ల ముత్యాలమ్మ గుడి అభివృద్ధికి గార్ల కు చెందిన పతంగి సురేష్ ఇరువై ఐదు రూపాయల నగదును బుధవారం విరాళం ఆలయ నిర్వాహకులకు అందించారు. తమ తల్లి తండ్రులైన పతంగి దేవోజి– సక్కుబాయి జ్ఞాపకార్థం ఈ విరాళం అందించినట్లు సురేష్ తెలిపారు. కాగా గుడి వద్ద బోరు, విద్యుత్ మోటారు ఏర్పాటుకు సహకరిస్తామని గార్ల మాజీ సర్పంచ్ గంగా వత్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మహబూబాబాద్ జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# తాసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్ల సభ్యులు



**అశ్వాపురం జూన్ 25 నవభూమి:**అశ్వాపురం మండల నూతన తహసిల్దార్ మణిధర్ కు బుధవారం జిల్లా రేషన్ డీలర్ల అధ్యక్షుడు కొడాలి వెంకటేశ్వరరావు, రేషన్ డీలర్స్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ అధ్యక్షులు కొడాలి వెంకటేశ్వర్లు, పాయం భద్రయ్యు, రజిత, భవాని, వంశీ రేషన్ డీలర్స్ సభ్యులు తదితరులు పాల్గొనారు

## ప్రతిపక్షంలో ఉండేసరికి బిఆర్ఎస్‌కి

# మహిళల సమస్యలు గుర్తుకొస్తాయి

### తోట దేవి ప్రసన్న ఎద్దేవా






**కొత్తగూడెం జూన్ 25 నవభూమి ప్రతినిధి:** మహిళలకు తెలంగాణ వచ్చాక ఎలాంటి ఆదరణ లభించలేదు, సంక్షేమ పథకాల నుంచి మొదలుకొని క్యాబినెట్ బెర్తుల దాకా అడుగడుగునా గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అన్యాయమే చేశారని,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఎద్దేవా చేశారు. బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ లో కొత్తగూడెం నియోజకవర్గ స్థాయి మహిళా కాంగ్రెస్ రౌండ్ టేబుల్ సమావేశం దేవిప్రసన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కెసిఆర్ కు కేటీఆర్, హరీష్ రావుకు కవితకు 10 సంవత్సరాలు మహిళలు గుర్తురాలేదు తెలంగాణ ప్రజలు గుర్తు రాలేదు, తెలంగాణలో ప్రజల కష్టాలు, సమస్యలు గుర్తురాలేదు. ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత అన్ని గుర్తుకొస్తున్నాయన్నారు. మీరు ఇచ్చిన మాటలు ఎక్కడికిపోయినాయి, మహిళా పథకాలు సంక్షేమం విస్మరించారు. కనీసము మీ క్యాబినెట్లో మహిళలకు స్థానము ప్రతిపక్షముగా మేము కాంగ్రెస్ వాళ్ళం పోరాడితేనే ఇచ్చారన్నారు. కాంగ్రెస్ స్త్రీ సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తుందన్నారు. మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణమే కాకుండా మహిళలను ఓనర్లుగా చేసినటువంటి ఘనత కాంగ్రెస్కే దక్కింది మహిళలను వ్యాపారవేత్తలుగా పరిశ్రమకవేత్తలుగా తీర్చిదిద్దుతూ వడ్డీ లేని రుణాలను అందిస్తున్నది. 200 యూనిట్ కరెంటు తో పాటు సన్న బియ్యాన్ని 500 సబ్సిడీ గ్యాస్ ను అందిస్తున్నది. అప్పులలో కూరుకుపోయిన, ఇచ్చినటువంటి హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ఇందిరమ్మ ఇళ్ల కేటాయిస్తూ మహిళా క్యాంటీన్లతో పాటు చెప్పినవి చెప్పనివి అన్నిటిని కూడా అందిస్తూ మహిళా అభ్యున్నతికి పాటుపడుతున్నటువంటి కాంగ్రెస్ ప్రజా పాలనలో ఇందిరమ్మ రాజ్యంలో మహిళా సోదరీమణులు అందరూ కూడా సంతోషంగా ఉన్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలే మహారాణులుగా కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కొల్లు పద్మ , మహిళా కాంగ్రెస్ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ బోడ దివ్య, మహిళా కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కళ్యాణి, హైమా, రమాదేవి, శారద, పద్మ, విద్య, అరుణ, శ్రీలక్ష్మి భవాని, విజయలక్ష్మి, పద్మ, శ్రీలత రెడ్డి, సుశీల, రాజేశ్వరి, రజనీ, వార్డు మెంబర్ మాజీ సర్పంచులు మహిళా కాంగ్రెస్ కమిటీ మెంబర్స్, తదితరులు పాల్గొన్నారు

## బెస్ట్ అవైలబుల్ స్కీం పెండింగ్ బకాయిలను

# వెంటనే విడుదల చేయాలి

### కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ డిమాండ్




**ఖమ్మం, నవభూమి జూన్ 25:** బెస్ట్ అవైలబుల్ స్కీం కింద విడుదల చేయవలసిన రెండేళ్లుగా పెండింగ్ లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం న స్థానిక జడ్పీ సెంటర్ లో బెస్ట్ అవైలబుల్ పథకం క్రింద చదువుతున్న విద్యార్థుల తల్లితండ్రులతో జరిగిన సమావేశంలో మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలోనీ ఎంపిక చేసిన కార్పోరేట్, ప్రైవేటు పాఠశాలలో సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద దళిత పిల్లలు 19వేల మంది, గిరిజన పిల్లలు 6 వేలమంది మొత్తం 25 వేలమంది ఈ స్కీం క్రింద చదువుకుంటున్నారని, ప్రతి ఏటా ఫీజులు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా 154 కోట్లు చెల్లించకుండా దళిత, గిరిజన విద్యార్థుల చదువులకు పూత పెట్టడం సరైనది కాదని వారు విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిది నెలల నుండి, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఈ బిల్లులు చెల్లించకపోవడంతో పేద విద్యార్థుల చదువులకు నష్టపోతున్నారనీ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గత ఫీజులు చెల్లించకపోవడంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పిల్లలకు వసతి, భోజనాలు కూడా పెట్టలేకపోతున్నామని యాజమాన్యాలు తమ గోడును వెల్లబోసుకుంటున్నారనీ, ఈ స్కీం క్రింద చదువుతున్న విద్యార్థుల ఫీజులను చెల్లించకపోతే పిల్లల చదువులకు దూరమయ్యే దుస్థితికి దారితీసే ప్రమాదం పొంచి ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వారు ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రభుత్వం నుండి బకాయి పడ్డ 154 కోట్ల రూపాయలను తక్షణమే చెల్లించే విధంగా స్థానిక ముగ్గురు మంత్రులు కృషి చేయాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో జరిగే ఆందోళన ఉద్యమాలకు బాధ్యత వహించవలసి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు దాసరి వెంకన్న, సురేష్, శ్రీకాంత్, నాగమల్లేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# కిషన్ నాయక్ కన్నుమూత

**కొత్తగూడెం జూన్ 26 నవభూమి ప్రతినిధి:** బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బానోతు విజయలక్ష్మి భర్త, మాజీ కాంగ్రెస్ నేత, బిందుపల్లవి హాస్పిటల్ చైర్మన్ భానోత్ కిషన్ నాయక్ (60) గుండెపోటుతో బుధవారం కొత్తగూడెంలో హఠాత్ మరణం చెందారు. ఆయన పార్థివ దేహానికి వైద్యులు, పట్టణ ప్రముఖులు, నేతలు, నివాళులర్పించారు. అంతక్రియలు స్వగ్రామం పాల్వంచ మండలం పాండురంగపురంలో గురువారం నిర్వహించనున్నారు. ఆయనకు కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### జల్సాలతో చోరీలకు పాల్పడుతున్న

# ఇద్దరు చోరుల అరెస్ట్

## 2.15 లక్షల సొత్తు స్వాధీనం




**గార్ల, నవభూమి, జూన్ 25:** జల్సాలకు అలవాటు పడి చిన్నతనం నుంచే తాళాలు వేసిన ఇండ్లలో దూరి దొంగ తనాలకు పాల్పడుతున్న గార్ల చెందిన ఇద్దరు తోడు దొంగలను అరెస్టు చెయడం తో పాటు వారి నుండి రెండు లక్షల 15 రూపాయల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ డిఎస్పీ తిరుపతి రావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన గార్ల కొలిమి కొట్టం బజారుకు చెందిన మూడు నిఖిల్, బేతి అరవింద్ లు జల్సా లతో తాళాలు వేసిన ఇండ్ల గుర్తించి ఇళ్ల లోకి దూరి ఇంటి యాజమానులు దాచుకున్న బంగారు, వెండి ఆభరణాలతో పాటుగా నగదు ను అపహరించి జల్సా చేసే వారు. వీరిద్దరు చిన్న తనం నుంచే దొంగ తనాలకు పాల్పడే వారని, ఈ ఏడాది మార్చి మాసం నుంచి మే 10వ తేదీ వరకు చోరీలు చేస్తుండే వారు. స్థానిక కొలిమి కొట్టం బజారుకు చెందిన బాదావత్ కేస్లీ చేసిన ఫిర్యాదు మేరకు నిఖిల్, అరవింద్ పై నిఘా పెట్టగా చోరీలు చేస్తున్నట్లు నిర్ధారణ కావడంతో వీరి ఇరువురుని అదుపులోకి తీసుకొని విచారణ చేయగా చేసిన నేరాలు ఒప్పుకున్నారని ఆయన పేర్కొన్నారు. వీరు అపహరించిన ముప్పై గ్రాముల బంగారు చంద్ర హారం, ఇరువై గ్రాముల వెంకటేశ్వర స్వామి ఉంగరం, రెండు జతల బంగారు చెప్పుల దిద్దులు, పాత బంగారపు పుస్తేపు బిల్లలు, వంద గ్రాముల వెండి పట్టీలు, 3600 రూపాయల నగదు, రెండు సెల్ ఫోన్లు లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. పోలీస్ విధులను ఆటంకపరచిన నిఖిల్ పై రెండు కేసులు, అరవింద్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ చోరీ కేసులను ప్రత్యేకంగా తీసుకున్న మహబూబాబాద్ జిల్లా ఎస్పీ రాం నాథ్ కేకన్ ఆదేశాల మేరకు సిసిఎస్ సిఐ హాతీరాం ఆధ్వర్యంలో సిసిఎస్ ఎస్ఐ తాహెర్ బాబా, గార్ల ఎస్ ఐ షేక్ రియాజ్ పాష లతో టీం ను ఏర్పాటు చేసి దొంగలతో పాటు దొంగ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. చోరీ కేసులను ఛేదించిన పోలీస్ సిబ్బందికి డిఎస్పీ తిరుపతి రావు రివార్డులను అందించారు. ఈ విలేకరుల సమావేశంలో గార్ల - బయ్యారం సిఐ బి. రవికుమార్, గార్ల ఎస్ఐ రియాజ్ పాష, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పాయంచే రూ.3.60 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభం



**అశ్వాపురం జూన్ 25 నవభూమి:** అశ్వాపురం మండలం లో సుమారు 3.60 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించిన పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు. తుమ్మలచెరువు గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 20-00 లక్షల విలువైన సీసీ రోడ్లు ప్రారంభించారు.

సుమారు 3-00 కోట్లతో లోతువాగు పై నిర్మించిన వంతెన ప్రారంభించినారు. అనంతరం వెంకటాపురం, భీమవరం, గొందిగూడెం, గొందిగూడెం కొత్తూరు, ఎలుకలగూడెం, వేములూరు గ్రామాలలో సుమారు 40 లక్షల విలువైన సీసీ రోడ్ల ప్రారంభోత్సవం చేశారు ఈ కార్యక్రమంలో ఓరుగంటి బిక్షమయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఓరుగంటి రమేష్ బాబు గాదేకేశవరెడ్డి, భద్రారెడ్డి, ఎస్కే ఖదీర్, తుక్కాని మధుసూదన్ రెడ్డి, కమటం నరేష్, తూము రాఘవులు, తాసిల్దార్ మనిధర్, రెవిన్యూ అధికారులు, వివిధ శాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

- నగరంలో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలి
- ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 4వ డివిజన్‌లో సీసీ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల









**ఖమ్మంనగరం, నవభూమి, జూన్ 25:** అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంత్రి, నగర మేయర్ పునుకొల్లు నీరజ, నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి బుధవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 4వ డివిజన్ రాజీవ్ నగర్ గుట్ట ప్రాంతంలో టి.యు.ఎఫ్. ఐ.డి.సి. నిధులు 50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ 4వ డివిజన్ రాజీవ్ నగర్ గుట్ట ప్రాంతంలో అవసరమైన విద్యుత్ లైన్లు వేసేందుకు నిధులు చెల్లించామని, స్థానిక అధికారులు దగ్గరుండి సరిగ్గా పని చేయించుకోవాలని అన్నారు. నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. 6వ డివిజన్ లో ప్రజలందరి భాగస్వామ్యంతో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టాలని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పనులు వానలు రాకముందే పూర్తి చేయాలని, డ్రైయిన్ నిర్మాణ పనులు ప్రాధాన్యతగా చేపట్టాలని అన్నారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్ అన్ని డివిజన్ లలో అమలు చేయాలని, వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పేదలు నివసించే ప్రాంతాల్లో అధిక శ్రద్ధతో ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయాలని అన్నారు. నగరంలో పెండింగ్ అంతర్గత రోడ్డు, డ్రైయిన్ నిర్మాణ పనులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వర్షాకాలం ముగిసిన తర్వాత వాటిని మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. డివిజన్ ను పరిశుభ్రంగా ఉంచుకోవడం, పెద్ద ఎత్తున మొక్కలు నాటి పచ్చదనం పెంచడం బాధ్యతగా చేయాలని, ఖాళీ స్థలంలో నీరు నిల్వ ఉండకుండా, చెత్త పేరుకొని పోకుండా చూడాలని, ప్రైవేట్ ఖాళీ స్థలాలకు ఫెన్సింగ్, గ్రౌండ్ లెవెలింగ్ వంటి పనులు చేపట్టాలని భూ యజమానులకు నోటీసులు జారీ చేయాలని అన్నారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ డివిజన్ లో అంతర్గత రోడ్లు, డ్రైయిన్ నాణ్యతతో నిర్మించుకోవాలని అన్నారు. మన ఇంటి ముందు చెత్త వేయవద్దని, కార్పోరేషన్ అధికారులకు సహకరించాలని అన్నారు. ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలు తమ వంతు బాధ్యత నెరవేర్చాలని అన్నారు. నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూలి 580 మీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులకు 50 లక్షల రూపాయలతో నేడు శంకుస్థాపన చేశామని అన్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రోడ్డు విస్తరణ పనులు, పేయింటింగ్ పనులు, పారిశుధ్య నిర్వహణ కోసం నూతన వాహనాలను కొనుగోలు చేశామని అన్నారు. నగరంలో ప్రజలకు ప్రాథమిక వసతుల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా, పబ్లిక్ హెల్త్ ఇఇ వి.రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, ఖమ్మం. ఆర్డీఓ నరసింహా రావు, ఖమ్మం అర్బన్ తహసిల్దార్ సైదులు, కార్పొరేటర్ లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏమర్జెన్సీని తలపించేలా మోడీ పాలన

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య



**ములకలపల్లి జూన్ 25 నవభూమి:** ఆనాడు కాంగ్రెస్ ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రఘటిత ఎమర్జెన్సీ దేశ చరిత్రలో చీకటి రోజని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య తెలిపారు.బుధవారం మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఆనాడు ఇందిరా గాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ తీసుకొచ్చి దేశంలో వందలాది మంది ప్రతిపక్ష నాయకులను రాత్రికి రాత్రి అరెస్టు చేసి జైల్లో కుక్కిందని పత్రికల నోరు నొక్కి పత్రికా స్వేచ్ఛ కు భంగం కలిగించిందని, వందలాది కార్మిక నాయకులను నిర్బధించి జైల్లో పెట్టిందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటాలలో సిపిఎం ముందంజలో ఉన్నందున దానినే లక్ష్యంగా చేసుకుని నిరంకుశ తత్వం కొనసాగింపే దేశానికి విస్తరించి ఎమర్జెన్సీ రూపంలో ప్రజాస్వామ్యాన్ని హరించిందని అన్నారు. ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి సిద్ధమయ్యారని అన్నారు.1975 అత్యవసర పరిస్థితి నాటి ప్రతి భయానక ఘట్టం ఇప్పుడు పునరావృతం అవుతుందని అన్నారు. ఆనాడు కాంగ్రెస్ ఇందిరా గాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీని ఎలా వ్యవ హరించిందో ఈనాటి బిజెపి ప్రభుత్వం కూడా అదే పద్ధతిలో వ్యవహరిస్తుందని అన్నారు. అప్పుడు ఎమర్జెన్సీ తో పోరాడి ఎమర్జెన్సీని వెనక్కి నెట్టినట్టే మనం మళ్లీ నిరంకుశ తత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని తెలిపారు.నేడు మోడీ ప్రభుత్వం లౌకికవాదం, సమైక్యవాదం,సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, యొక్క పునాదులను నాశనం చేసే కుట్ర పన్నుతుందని అన్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న ఫాసిస్ట్ బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటాలు ఉధృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ ప్రాథమిక హక్కులను లౌకికవాద ప్రజాస్వామ్యాన్ని రక్షణకై ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, మాలోత్ రావుజ, వూకంటి రవికుమార్, నిమ్మల మధు, అమల, గోపగాని లక్ష్మీ నరసయ్య, బైరు ప్రసాద్, బుగ్గా వెంకట నరసమ్మ, హెమని, తదితరులు పాల్గొన్నారు.

### వరద విపత్తులను ఎదుర్కొనేందుకు

# సన్నద్ధం కావాలి: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

- పునరావాస కేంద్రాలను సమీప ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి
- నీటి వనరుల స్థితిగతులను నిరంతరం పర్యవేక్షించాలి
- జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో విపత్తుల నిర్వహణపై సమీక్షించిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం నవభూమి బ్యూరో, జూన్ 25:** వరద విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ లతో కలిసి విపత్తుల నిర్వహణపై జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో బుధవారం సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గతంలో ముంపునకు గురైన ప్రతి హ్యాబిటేషన్ ఇంటిలో ప్రజలను మరోసారి వరదలు వస్తే ఎక్కడికి తరలిస్తామనే మైక్రో లెవల్ ప్లానింగ్ సిద్ధం చేసుకోవాలని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా సమీపంలో రిహాబిలిటేషన్ సెంటర్ లను గుర్తించి, అక్కడ అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పించాలని, పునరావాస కేంద్రాల సమాచారం ముందుగానే వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అందించాలని, వరద రాగానే ఆ కేంద్రాలకు వెళ్లేలా ప్రజలను సిద్ధం చేయాలని అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో 24 గంటల పాటు పని చేసే కంట్రోల్ రూమ్ వెంటనే ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు నమోదు చేసుకొని సత్వరమే పరిష్కరించేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. వరదల గురించి ముందుగానే మనకు సమాచారం అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఉన్న నీటి వనరులను నిరంతరం మానిటరింగ్ చేయాలని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో, నీటి వనరులకు సమీప ప్రాంతాల్లో అవసరమైన బోట్లు, రోప్స్, లైఫ్ జాకెట్, మైక్స్, లైట్లు అందుబాటులో ఉంచాలని, గజ ఈతగాళ్ళ ను పంపే విధంగా జాబితా సిద్ధం చేసి పెట్టుకోవాలని అన్నారు. 300 మంది ఆపద మిత్రల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా ప్రణాళిక తయారు చేయాలని, విపత్తుల నిర్వహణ కోసం ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందాలను స్థానికంగా అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల నిర్వహణ, అక్కడ ప్రజలకు అవసరమైన ఆహార సరఫరా, మెడికల్ క్యాంపు ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణకు మున్సిపల్, స్థానిక సంస్థల ద్వారా ప్లానింగ్ చేయాలని అన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, జిల్లాలో ఉన్న మున్సిపాల్టీలలో వాటర్ లాగింగ్ లేకుండా అవసరమైన మరమ్మత్తు పనులు వెంటనే పూర్తి చేయాలని అన్నారు. వరదల సమయంలో క్షేత్రస్థాయి పరిస్థితుల సమాచారం అధికారుల నుంచి వెంటనే తనకు అందాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ముందు జాగ్రత్త చర్యలు చాలా అవసరమని అన్నారు. లో తట్టు ప్రాంతాల స్థానిక నాయకులతో సమన్వయంతో ఉండాలని, ప్రజలలో అనవసర ఆందోళన సృష్టించవద్దని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను సమీప ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని, లోతట్టు ప్రాంతాల్లోని రోడ్డు గుంతలు పూడ్చివేయాలని అన్నారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జిల్లాలో పునరావాస కేంద్రాలలో ప్రజలను తరలించినప్పుడు వారికి అవసరమైన ఏర్పాట్లు కల్పించాలని అన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలకు ముందస్తుగా జిప్ కవర్లు పంపిణీ చేయాలని, ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు వాటిలో భద్రపర్చుకొనేటట్లు తెలియజేయాలని అన్నారు. ప్రతి మండలంలో గజ ఈతగాళ్ళ జాబితా సిద్ధం చేసి పెట్టుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీలు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ వద్దు - భవిషత్తు ముద్దు

### టూ టౌన్ సీఐ ప్రతాప్ యువతకు పిలుపు

### సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో డ్రగ్స్‌పై అవగాహన సదస్సు







**రుద్రంపూర్ జూన్ 25 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్ పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సూచనలతో టూ టౌన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణ అవగాహన వారోత్సవాల సందర్భంగా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ లోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ లో విద్యార్థులకు డ్రగ్స్ పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టూ టౌన్ సీఐ ప్రతాప్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమైన సందేశం అందించారు. ఆయన మాట్లాడుతూనేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అని విద్యార్థి దశలోనే పిల్లలను మంచి మార్గంలో నడిపించడం సమాజం యొక్క ప్రధాన బాధ్యత అని చుట్టూ జరుగుతున్న అనైతిక కార్యకలాపాల గురించి వారిలో అవగాహన పెంచాలి.డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల ప్రభావం ఇప్పుడు పల్లెప్రాంతాలకూ విస్తరించిందనీ,వీటి నుంచి యువతను కాపాడుకోవాలి" అని తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు రవాణాకు సులభ మార్గాలనీ, విద్యార్థులు, యువత వీటికి బలవుతున్నారనీ, మత్తులో ఉన్న వ్యక్తి తన చర్యల్ని గుర్తించలేని స్థితికి చేరతాడనీ, ఈ అలవాటు అనేక ఆరోగ్య సమస్యలతో పాటు నేరపూరిత జీవితానికి దారితీస్తుందని అన్నారు. అంతేకాకుండా సరదా కోసం అయినా డ్రగ్స్ వైపు అడుగు వేయకండనీ, ఇవి కేవలం వ్యక్తిని కాదు, కుటుంబాన్నీ నాశనం చేస్తాయని తెలిపారు. డ్రగ్స్‌కి బలైపోకుండా మీ భవిష్యత్తును కాపాడుకోనీ విజేతలుగా ఎదగండి అంటూ విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ అవగాహన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పోలీసులు ముందుగానే తీసుకుంటున్న జాగ్రత్త చర్యలు, ప్రజల్లో విస్తృత అవగాహన పెంచే కార్యక్రమాలు అభినందనీయంగా నిలుస్తున్నాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నెల్లూరు శేషుబాబు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మత్తుపదార్థాల వినియోగం, రవాణ వ్యతిరేక దినోత్సవం







**అశ్వాపురం జూన్ 25 నవభూమి:** అశ్వాపురం మండలం ప్రభుత్వం జూనియర్ కళాశాల లో జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం ను పురస్కరించుకొని, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆశ్వాపురం లో బుధవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు మాదకద్రవ్యాలపై అవగాహన కలిగించే పోస్టర్లను రూపొందించి, కళాశాల ప్రిన్సిపాల్ నెల్లూరు శేషుబాబు చేతుల మీదుగా విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాస రచన పోటీ నిర్వహించబడింది. విద్యార్థులు మాదకద్రవ్యాల హానికర ప్రభావాలు మరియు వాటి నివారణపై తమ అభిప్రాయాలను బోధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వాడకాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరిలోనూ జాగృతి అవసరమని సూచించారు. ముఖ్యంగా టెలీ మానస్ కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, ఇది మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ప్రభుత్వ సహాయం కార్యక్రమమని వివరించారు. మానసిక ఒత్తిడి వల్ల యువత మాదకద్రవ్యాల వైపు ఆకర్షితమవుతున్న నేపథ్యంలో, టెలీ మానస్ వంటి సేవలు వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మాదకద్రవ్యాలపై సమాజంలో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ప్రతి ఒక్కరూ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# మానవత్వం చాటుకున్న తాటి వాణి



**బూర్గంపాడు జూన్ 25 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ ఎస్టి కాలనీ గ్రామానికి చెందిన తాటి వాణి నిత్యం ప్రజాసేవలో ప్రజలతో ఉంటూ ఆపదలో ఉన్న వారిలో తనవంతు సహకారం చేస్తూ వస్తుంది. ప్రజాసేవ చేయాలనీ ఇటు యువతకు క్రీడారంగలో చేయూతనిస్తూ గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకుంటూ తన పరిధిలో ఉన్న వాటిని పరిష్కరిస్తూ అనేకుల మన్నలను పొందుకుంటుంది. అదే గ్రామానికి చెందిన కొమరం రాముడు తల్లి అయిన కొమరం ఆదెమ్మ అనారోగ్య కారణాలవల్ల ఇటీవల కాలంలో ఈ లోకాన్ని విడిచినారు. విషయం తెలిసిన తాటి వాణి వారి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటూ ఖర్చులు నిమిత్తం 2000 రూపాయలు కుటుంబ సభ్యులకు అందించి భవిష్యత్తులో ఏమి అవసరం ఉన్నా తన వంతు ఆ కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటానని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు తాటి వాణి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, గ్రామస్తులు, యువకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత మావోయిస్టులకు సహకరిస్తే

# కఠిన చర్యలు తప్పవు

### గుండాల సిఐ రవీందర్



**గుండాల జూన్ 25 నవభూమి:** గుండాల మండలంలోని శెట్టిపల్లి, కోటగడ్డ, సజ్జలబోడు, చింతలపాడు గ్రామాలలో గుండాల సీఐ రవీందర్, గుండాల ఎస్ఐ సైదా రవూఫ్, కొమరారం ఎస్ఐ నాగుల్ మీరా లు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీఐ రవీందర్ మాట్లాడుతూ మండలంలో ఎవరైన అనుమానితులుగా కొత్త వ్యక్తులు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. నిషేదిత మావోయిస్టులకు సహాయ సహకారాలు అందించి కేసులకు గురికావద్దని హెచ్చరించారు. మావోయిస్టులు



కాలం చెల్లిన సిద్ధాంతాలను నమ్ముకుని తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని జన జీవన స్రవంతిలో కలిస్తే పోలీస్ శాఖ నుంచి ఆపరేషన్ చేయూత ద్వారా ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందిస్తామని, తమ కుటుంబాలతో ఆనందంగా జీవించవచ్చని తెలిపారు. మావోయిస్టుల మాయమాటలు నమ్మి నిండు జీవితాలను అర్ధంతరా%శీ% చేసుకోవద్దని పిలుపునిచ్చారు. అమాయక ప్రజలను టార్గెట్ చేసుకుని మావోయిస్టులు తమ ఊబిలోకి దించుతూ వారి స్వలాభం కోసం అమయాకులను బలికొంటున్నారన్నారు. నిరుద్యోగులకు పోలీస్ శాఖ నుంచి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా శెట్టిపల్లి గ్రామంలోని యువతకు గుండాల సిఐ రవీందర్, కొమరారం ఎస్సై నాగుల్ మీరా వాలీబాల్ కిట్టును అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గుండాల, కొమరారం పియస్. సిబ్బంది మరియు స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# టీపీసీసీ జనరల్ సెక్రెటరీగా నాగా సీతారాములు నియామకం



**కొత్తగూడెం జూన్25 నవభూమి ప్రతినిధి:** హైదరాబాద్ గాంధీ భవన్ లో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన టీపీసీసీ కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ భట్టి విక్రమార్క ఇటీవల నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తనపై నమ్మకంతో పార్టీ ఇచ్చిన బాధ్యతను తూచా తప్పకుండా పాటిస్తూ పార్టీ విధి విధానాలకు కట్టుబడి ఉంటానన్నారు. పార్టీ బలోపేతానికి అందరినీ కలుపుకుని సమిష్టిగా ముందుకు వెళ్తానని, కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు వస్తుంది అని చెప్పడానికి తానే నిదర్శనమన్నారు. స్టూడెంట్ ఆర్గనైజేషన్ నుండి మొదలై మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల వరకు ఎన్నో ఒడిదుడుకులు, ఒత్తిళ్ళు, అవమానాలు, అరెస్టులు, ఉద్యమాలు అన్ని చూసుకుంటా కేవలం పార్టీ బలోపేతం, కార్యకర్తల సంక్షేమం కోసం గత 3 దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ లోనే కొనసాగిన తనకు గతంలో టీపీసీసీ మెంబెర్ గా ఇప్పుడు టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా పార్టీ అవకాశం ఇచ్చిందన్నారు. ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీ ఆశావాహుడిగా ఉండి తనకు టికెట్ దక్కనప్పటికి అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు ఎన్నికల్లో పార్టీ లైన్ దాటకుండ ప్రచారం చేసిన వ్యక్తిత్వం తనదన్నారు. కష్టపడి పని చేస్తే అధిష్టానం గుర్తుంచి సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మహా వృక్షమని, ఆ నీడలో అందరం కలిసి సమిష్టిగా పని చేస్తామని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భాద్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, చైర్ పర్సన్ సోనియా గాంధీ, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘు రాంరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి లకు నాగా సీతారాములు కృతజ్ఞతలు తెలిపారు.

# నాణ్యమైన విద్యుత్ లక్ష్యంగా పనులు ప్రారంభం



**ఎర్రుపాలెం,నవభూమి,జూన్ 25:** గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నూతన విద్యుత్ పనులను చేపట్టినట్లు ఏడి అనురాధ ఏఈ అనూష తెలిపారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చొరవతో తెల్లపాలెం గ్రామానికి మంజూ రైన విద్యుత్ నూతనస్తంభాల ఏర్పాటుకు మధిర విద్యుత్ ఏడి అనురాధ మండల ఏఈ అనూష కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి బుధవారం పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏడి అనురాధ మాట్లాడుతూ మండలంలో మారుమూల గ్రామాలతో సహా అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో అవసరమైన నూతన కరెంటు స్తంభాలు మరియు కొత్త లైన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూతెల్లపాలెం గ్రామానికి భట్టి విక్రమార్క చొరవతో మంజూరైన 8 లక్షల రూపాయలునిధులతో నూతన స్తంభాలు, క్రొత్త లైన్ పనులను ప్రారంభించినట్లు తెలి పారు.ఈ కార్యక్రమంలో నాయకులు మేరీ చెన్నయ్య,కంచర్ల వెంకట నరసయ్య, తలపురెడ్డి నాగిరెడ్డి,కడియం శ్రీనివాస రావు,షేక్ ఇస్మాయిల్,గుడేటి బాబురావు, దేవరకొండ రాజీవ్ గాంధీ,దేవరకొండ ఏడు కొండలు విద్యుత్ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఓబిలో రిజిస్టర్ ప్రకారం స్థానికులకే అవకాశం ఇవ్వాలి

### ప్రైవేట్ సంస్థలు సింగరేణి నిబంధనలు ఉల్లంఘిస్తే చూస్తూ ఊరుకోలేను :ఐ ఎఫ్ టి యు డిమాండ్



**కొత్తగూడెం జూన్ 25 నవభూమి ప్రతినిధి:**కొత్తగూడెంలో కొత్తగా రాబోతున్న ఓబీ సౌదా కంపెనీ స్థానికులకు అవకాశం ఇవ్వాలని, సింగరేణి నిబంధనలు ఉల్లంఘిస్తూ స్థానికేతరులకు ఎక్కువ అవకాశం కల్పిస్తే ఆ కంపెనీలపై పోరాటం తప్పదని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎండి రాసుద్దీన్, ఏ వెంకన్న హెచ్చరించారు. కొత్తగూడెం రైటర్ బస్తి ఐఎఫ్టియు కార్యాలయం లో రీజియన్ ఉపాధ్యక్షులు మోత్కూరి మల్లికార్జున రావు ప్రసంగిస్తూ సింగరేణిలో లేని కొత్త ఆనవాయితీని ఈ సౌదా కంపెనీ తీసుకొస్తూ ఉందని ఇది రేపు మిగతా ప్రైవేటు ఓబి కంపెనీలకు కూడా అలవాటు అయ్యే ప్రమాదం ఉందని దీన్ని తక్షణమే ఉపసంహరించుకొని పాత పద్ధతిలోనే రిక్రూట్మెంట్ కొనసాగించాలని కోరారు. ఓసీ లో 600 మంది కార్మికులు గతంలో భూములు కోల్పోయి నిర్వాసితులుగా మారి అక్కడ ఓబీలో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అలాంటి కార్మికులు ఈనాడు ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా అప్లై చేసుకోమంటే అక్కడ ఉన్న వారందరికీ చదువు రాదని, ఎక్కడైతే ఓపెన్ కాస్ట్ తీస్తున్నారో అక్కడే ఉండి ఆధారాలు సేకరించాలని వారన్నారు.సౌదా కంపెనీ స్థానికులకు అందరికి అవకాశాలు ఇవ్వాలని, రిజిస్టర్ ప్రకారం అవకాశాలు కల్పించాలని వారన్నారు.2019 తర్వాత ఖాళీగా ఉండటం వల్ల వీళ్లకు వీటిసి మెడికల్ లేదని అప్లికేషన్లు తీసుకొని వీటిని మెడికల్ ఆ కంపెనీ ఏర్పాటు చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ సి సి డబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎన్ సంజీవ్, మోత్కూరి మల్లికార్జునరావు,వాసు,అశోక్,శ్రీనివాస్,చందర్,సురేష్, రమేష్ వెంకన్న, రాజు, విజయ్, కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాన్ని పంచాయతీ భవనానికి కేటాయించాలి



**కారేపల్లి, నవభూమి, జూన్ 25:** కారేపల్లిలోని సర్వే నెం.38లోని ప్రభుత్వ స్థలాన్ని సింగరేణి గ్రామపంఛాయతీ భవన నిర్మాణానికి కేటాయించాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ ఎస్.సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సింగరేణి గ్రామపంచాయతీకి భవనంలేక గ్రంధాలయ భవన అవసరణంలో నిర్మించిన భవనం ఇరుకు గదులలో నడుస్తుందని వినతిలో తెలిపారు. కారేపల్లిలో బీసీ హాస్టల్ భవనంకు కేటాయించిన స్థలం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం మధ్యలో ఉన్న ఖాళీ స్థలాన్ని పంఛాయతీ భవన నిర్మాణానికి కేటాయించాలని వినతిలో తహసీల్దార్‌ను కోరారు. వినతిపత్రం అందించిన వారిలో గ్రామస్తులు తురక నారాయణ, కల్లూరి నాగచారి, గుండెబోయిన బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కుటీర పరిశ్రమలను ప్రోత్సహిస్తాం ఆరోగ్య తెలంగాణను నిర్మిస్తాం: భట్టి



**హైదరాబాద్ నవ భూమి ప్రతినిధి జూన్ 25:**పెద్ద ఎత్తున ఉపాధి, ఆదాయాన్ని సృష్టించే కుటీర పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం ట్యాంక్ బండ్ పై బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బిసి చేతి వృత్తి కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకానికి సంబంధించిన స్టాల్స్ ను ప్రారంభించిన అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. చేతివృత్తులు, కళాకారుల ఉత్పత్తులు సమాజానికి పెద్ద ఎత్తున ఉపయోగపడతాయి అన్నారు. చేతి వృత్తుల ఉత్పత్తులను ప్రోత్సహించి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈనెల 25 నుంచి 29 వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, హైదరాబాద్ నగరానికి చెందిన వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి కుటీర పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుందని ఈ ఎగ్జిబిషన్ ను రాష్ట్ర ప్రజలు ఉపయోగించుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. ఈ ప్రదర్శనను తిలకించి నచ్చిన వస్తువులు, పర్యావరణహితమైన ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఉత్పత్తులు కొనుగోలు చేసి చేతి వృత్తుల వారికి చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం సూచించారు. బిసి కార్పొరేషన్ల పై ప్రత్యేక దృష్టి సారించి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో కుమ్మరులు తయారుచేసిన మట్టి పాత్రలు మేదరి వారు తయారు చేసిన వెదురు వస్తువులు పూసల వారి సామగ్రి అదే విధంగా పోచంపల్లి, గద్వాల, నారాయణపేట మొదలైన చేనేత ఉత్పత్తులు గౌడ అన్నలతో ఏర్పాటుచేసిన నీరా ఉత్పత్తులు, వారు తయారు చేసిన వస్తువులను డిప్యూటీ సీఎం ఆసాంతం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెస్త సోదరులచే ఏర్పాటుచేసిన చేపల వంటకాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లతో కలిసి డిప్యూటీ సీఎం ఆరగించారు.

# మాదక ద్రవ్యాల రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## ఎస్పీ రోహిత్ రాజు





**కొత్తగూడెం జూన్ 25 నవభూమి ప్రతినిధి:**యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యసాధనకై కృషి చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణకై అవగాహనా వారోత్సవాలలో భాగంగా సుజాతనగర్ పోలీసుల ఆధ్వర్యంలో వేపలగడ్డ లోని ఓ ఫార్మసీ కళాశాల లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డ్రగ్స్ నిర్మూలన పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ కోరారు. జీవిత లక్ష్యం పై మాత్రమే విద్యార్థులదృష్టి ఉండాలని,నిషేధిత గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల విద్యార్థులు, యువత ఆకర్షితులు కావద్దన్నారు. గంజాయి, డ్రగ్స్ అలవాటు వలన శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని పాడుచేస్తుందని కావున చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన గంజాయి రహిత ప్రాంతమే లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం పోలీసు శాఖ కృషి చేస్తోందని అందులో బాగంగా విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మత్తుకు బానిస అవడానిని అనేక కారణాలు ఉంటాయి పరిసరాల ప్రభావం, చెడు స్నేహితులు, సన్నిహితుల వలన చెడు మార్గాల వైపు వెళ్ళవద్దని విజ్ఞప్తి చేశారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు యువత, విద్యార్థులు అంతా యాంటీ డ్రగ్స్ కమిటీలలో సభ్యులుగా చేరి యాంటీ డ్రగ్స్ సోల్జర్ గా సహకరించాలని తెలిపారు. యువత యొక్క ప్రవర్తనను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనిస్తూ వారు ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా గమనిస్తూ ఉండాలని సూచించారు. మీ మీ ప్రాంతాలలో ఎక్కడైనా గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబధిత సమాచారాన్ని స్థానిక పోలీసులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, కొత్తగూడెం 2టౌన్ సీఐ ప్రతాప్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు,1టౌన్ సీఐ కరుణాకర్, 3టౌన్ సీఐ శివప్రసాద్, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ రాము, సుజాత నగర్ ఎస్సై కళాశాల ఛైర్మన్ అరికల భాస్కర్, 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# లుక్కా హిమజకు టీజి పిజి లాసెట్‌లో ఫస్ట్‌ర్యాంకు

■ హైదరాబాదు విద్యార్థిని ఘన విజయం. సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తిగా అవ్వాలన్న ఆశయం



హైదరాబాదు-నవభూమిబ్యూరో

2025లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ లా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (TG PGLCET) ఫలితాలు ఈ రోజు విడుదలయ్యాయి. ఈ పరీక్షలో హైదరాబాదు ఎల్.బి.నగర్‌లోని హిమపూరి కాలనీకి చెందిన లుక్కా హిమజ రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించారు. కుటుంబం, గురువులు, మిత్రుల మద్దతుతోనే ఈ విజయం సాధించగలిగానని ఆమె అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ లా లో హిమజ ఐదేళ్ల బీఏ, ఎల్ఎల్‌బీ కోర్సు చదివారు. చదువులో చిన్ననాటి నుంచే ప్రతిభ చూపిన హిమజ పదవ తరగతి హైదరాబాదు టాలెంట్ స్కూల్లో చదివి 10/10 గ్రేడు సాధించగా, లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజీ, ఉప్పల్లో ఇంటర్ చదివి కాలేజీ టాపర్‌గా నిలిచారు.

హిమజ తండ్రి ఎల్.టి. చంద్రశేఖం రావు సుప్రీం కోర్టు న్యాయవాదిగా సేవలందిస్తున్నారు. ఆయన సుప్రీం కోర్ట్ బార్ అసోసియేషన్ సభ్యుడు. తల్లి శ్రీరేఖ తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా ఉన్నారు. బాబాయి పులి మధుసూదనరావు, పినతల్లి సుభాషిణి కూడా హైకోర్టులో న్యాయవాదులే. అక్క డాక్టర్ లుక్కా దివిజ ఎం.డి. జనరల్ మెడిసిన్ చేస్తున్నారు.

ఈ విజయంపై హిమజ స్పందిస్తూ, సుప్రీం కోర్ట్ న్యాయమూర్తి అవ్వాలని తన ఆశయం అని తెలిపారు. హిమజకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

కుటుంబసభ్యుల ఆనందోత్సాహాలు



# అంజలి హత్య కేసు ఛేదన

# ముగ్గురిపై కేసు నమోదు

**కుత్బుల్లాపూర్ - జూన్ 25:(నవభూమి ప్రతినిధి)**జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన అంజలి హత్య కేసులో నిందుతుల వివరాల తమ ప్రేమ వ్యవహారానికి పదే పదే అడ్డొస్తుందని పదవ తరగతి చదువుతున్న కన్న కూతురే తేజశ్రీతన ప్రియుడు, ప్రియుడి తమ్ముడితో కలిసి తల్లిని హత్య చేశారని తెలిపిన పోలీసులు.ఈ నెల 23 న సోమవారం సాయంత్రం షాపూర్ నగర్ లోని మృతురాలి ఇంట్లో అంజలి(39) పూజ చేస్తుండగా పక్క ప్లాన్ తో గొంతు నులిమి, తలపై కొట్టి హత్య కు పాల్పడ్డట్లుగాదర్యాప్తులతేలిందన్నారు పోలీసులు.గత కొద్ది నెలలుగా నిందితురాలుకన్న కూతురుతల్లితో గొడవలు పడుతూ ఉండేదని,తన ప్రేమ విషయంలోనూ అడ్డొస్తుందనే ఉద్దేశంతో తల్లిని హత్య చేసినట్లు నిందితురాలు దర్యాప్తులో తెలిపిందని అన్నారు.ప్రియుడు శివ(19) డిజే ఆపరేటర్గా పనిచేస్తూఉండేవాడని,ముగ్గురు నిందుతులపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామని విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు

# పర్యాటక రంగం అభివృద్ధికి తెలంగాణలో పుష్కలమైన అవకాశాలు

**హైదరాబాద్ నవ భూమి ప్రతినిధి జూన్ 25:**లిస్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరుతో కలసి సోమశిల, అమరగిరి ద్వీపం, ఇతర పర్యాటక ప్రాంతాలను సందర్శించిన మంత్రిరాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తూ ఈ రంగం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం ముందుకు వెళుతుందోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు అభివృద్ధిలో భాగంగా మంత్రి జూపల్లి సోమశిల, అమరగిరి, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, నార్లాపూర్ రిజర్వాయర్, కొల్లాపూర్ లోని మాధవస్వామి ఆలయం, జెటప్రోలు మదనగోపాల స్వామి దేవాలయాన్ని సందర్శించారు. పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంత్రి జూపల్లి వెంట పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు, కలెక్టర్ బదావత్ సంతోష్, ఇతర అధికారులు ఉన్నారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టుకు 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్/యూనియన్ టెరిటరిస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్(సాస్కి)' పథకం కింద రూ.68.10 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో పర్యావరణం, జల వనరులు, ఆలయాలు, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్ కు పుష్కలమైన వనరులు ఉన్న సోమశిల, అమరగిరి ద్వీపం, ఈగలపెంటను అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పర్యాటక శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం కొల్లాపూర్ క్యాంప్ కార్యాలయంలో సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు సంబంధించిన ప్రతిపాదనలు, కార్యాచరణపై పర్యాటక శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రపంచంలో ఎన్నో దేశాలు కేవలం టూరిజం ద్వారానే అభివృద్ధి చెందాయని, రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందుకువెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. త్వరలో టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణా లు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూపర్యాటక రంగాన్ని రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ముందుకు తీసుకెళ్తామని, ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని అన్నారు. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సోమశిల వెల్‌నెస్, స్పిరి చ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టుకు 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్/యూనియన్ టెరిటరిస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్(సాస్కి)' పథకం కింద రూ.68.10 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఆ నిధులతో పర్యావరణం, జల వనరులు, ఆలయాలు, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్ కు పుష్కలమైన వనరులు ఉన్న సోమశిల, అమరగిరి ద్వీపం, మల్లేశ్వరం, ఈగలపెంటను అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు.